## విధులు సక్రమంగా నిర్వర్తించాలి

జైనూర్, జూన్ 25 : సక్రమంగా విధులు నిర్వహించాలని వైద్యులు, సిబ్బందిని అదనపు డీఎంహెచ్‌వో మనోహర్ ఆదేశించారు. జైనూర్ మండలంలోని ఉషెగాం సర్కారు దవాఖానను మంగళవారం తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై రోగులకు సూచనలు చేయాలని తెలిపారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ బీ రాజు, జాదవ్ రమేశ్, హెచ్ఈవో స్టాఫ్ నర్స్ రజిత, రుబినా, ఫార్మసిస్ట్ మంగల్, సిబ్బంది సురేశ్ తదితరులున్నారు.

## ఉద్యోగోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి

కెరమెరి, జూన్ 25: గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో సవరించిన సర్వీసు రూల్స్ వెంటనే ప్రకటించాలని, పలు పోస్టుల ఉన్నతీకరణ, మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఉట్నూర్ ఐటీడీఏ పీవోకు వినతి పత్రం అందించారు. ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్, ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, కుమ్రం భీమ్ జిల్లా అధ్యక్షుడు అర్జున్, ప్రధాన కార్యదర్శి కే.వెంకటేశ్వర్‌రావ్, టీపీటీఎఫ్ నాయకులు బలిరాం వీ.శ్యాంరావ్, నారాయణ, 'సీహెచ్. శ్యాంరావ్, జీతేందర్, విశ్వనాథ్, ప్రకాశ్, ధర్మసింగ్, మంగళ్‌సింగ్, కైలాష్, రాజేశ్వర్, యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 25: గ్రామీణులకు బస్సు సర్వీస్‌లను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్టీసీ ఆసిఫాబాద్ డీఎం విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆసిఫాబాద్ నుంచి కన్నార్‌గాం మీదుగా నందుపాకు బస్సును ప్రారంభించారు. గ్రామీణులు, విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని సమయానుకూలంగా బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అనంతరం ప్రయాణికులతో కలిసి డీఎం బస్సులో నందుప వరకు వెళ్లారు.

## అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



కన్నెపల్లి : అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

కన్నెపల్లి, జూన్ 25 : కన్నెపల్లి మండలం జన్కాపూర్ రైతు వేదికలో కన్నెపల్లి, ఆకెనపల్లి అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యా ప్రణాళికపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. విద్యాబోధన తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్లు మమత, సృజన, బ్లాక్ కో-ఆర్డినేటర్ సుజాత శిక్షణ ఇచ్చారు. సూపర్‌వైజర్ సృజన, ఇందిరా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బెల్లంపల్లి, జూన్ 25 : నెన్నెల మండల అంగన్‌వాడీ టీచర్లకు తాళ్లగురిజాల రైతు వేదికలో శిక్షణ నిర్వహించారు. బెల్లంపల్లి సీడీపీవో మాస ఉమాదేవి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎల్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వాంకిడి, జూన్ 25 : బంబారా రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు వాంకిడి సీడీపీవో రేబక్క అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు కుమారి, భారతి, లత, కళావతి, ఎండీ, తౌఫిక్ పోషణ అభియాన్ మండల సమన్వయకర్త అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెంచికల్ పేట్, జూన్ 25 : మండలంలోని చెడువాయి రైతు వేదికలో సూపర్‌వైజర్ హసీనా ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

## హద్దులను పరిశీలిస్తాం

వేమనపల్లి, జూన్ 25 : కలెక్టర్ ఆదేశాల మేరకు గోధుంపేట శివారులోని సర్వే నంబర్ 2, 3లో గల భూమిలో హద్దులను పరిశీలిస్తామని తహసీల్దార్ రమేశ్, ఎఫ్ఆర్వో గోవింద్‌చందర్ సర్దార్ తెలిపారు. గతంలో ప్రభుత్వం 40 మందికి 78 ఎకరాలకు సంబంధించి పట్టా పాస్ బుక్‌లు ఇచ్చిందని, అయితే అటవీ శాఖ అధికారులు సాగుకు అడ్డుపడుతున్నారని నాగారం గ్రామానికి చెందిన మల్లేశ్‌తో పాటు, సుమారు 50 మంది పోడు రైతులు సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలు జారీచేయడంతో రైతులను తహసీల్ కార్యాలయానికి పిలిపించి, మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ బేగ్, శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

## అటవీ ఆంక్షలు ఎత్తివేయాలి

జన్నారం, జూన్ 25 : జన్నారం, కడెం, ఉట్నూర్, దండేపల్లి మండలాల్లో అటవీ శాఖ అధికారులు విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని సామాజిక కార్యకర్త భూమాచారి డిమాండ్ చేశారు. ఇందన్‌పెల్లిలో ఒంటిపై బ్యానర్ ధరించి, ప్రజలను చైతన్యం చేశారు. రాబోయే రోజుల్లో చేపట్టే పోరాటానికి మద్దతుగా నిలువాలని కోరారు. దాసరి తిరుపతి, ఇలియాస్, మహేశ్, కొమురెల్లి అశోక్, చందు, వినయ్, కిషోర్ సుదర్శన్ పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్ నవోదయ 'ప్రథమం'

కాగజ్‌నగర్, జూన్ 25 : జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఇటీవలే ప్రకటించిన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ విద్యాలయం వంద శాతం ఉత్తీర్ణతతో పాటు, దక్షిణ భారతంలోని 77 విద్యాలయాల్లోనే 88, 89 సగటు మార్కులతో మొదటి స్థానం సాధించింది. తిరుపతిలో రెండురోజులుగా కొనసాగుతున్న ప్రిన్సిపాళ్ల వార్షిక సమావేశంలో కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయ ప్రన్సిపాల్ బండ్ల చక్రపాణి పాల్గొన్నారు. ఆయనను విద్యాలయ సమితి సంయుక్త సంచాలకుడు శ్రీ జ్ఞానేశ్, ఉప సంచాలకుడు టీ గోపాలకృష్ణ సత్కరించి, పురస్కారం అందించారు. వివిధ రంగాల్లో విద్యార్థులు ప్రతిభ చూపడంతో ప్రశంసించారు.

## ఆక్రమణల గుర్తింపునకు క్షేత్రస్థాయి సర్వే

తాండూర్, జూన్ 25 : తాండూర్ మండలం ద్వారకాపూర్ శివారులోని రాంపూర్ చెరువు(కత్తెర్ల చెరువు) శిఖం భూమి ఆక్రమణలపై బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు. భూమి కబ్జాకు గురైందని కొద్దిరోజుల క్రితం రైతులు బెల్లంపల్లి ఆర్డీవోకు పిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆర్డీవో, తహసీలాదర్, ఎంపీడీవో, సర్వేయర్, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. సర్వే చేసి, ఓ రైతు చెరువు శిఖం భూమి కబ్జా చేసినట్లు గుర్తించారు. అతనిపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. చెరువు పూర్తి మత్తడి లెవెల్ (ఎఫ్‌టీఎల్) సరిహద్దు సర్వే చేసి గుర్తించాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని 612 సర్వే నంబర్‌లోని రైల్వే, పట్టాదారులకు సంబంధించిన భూమి విషయంలో ఆర్డీవో సమక్షంలో రెవెన్యూ, రైల్వే అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు.

## జాగ్రత్తలపై సదస్సు

శ్రీరాంపూర్, జూన్ 25 : శ్రీరాంపూర్ విశ్వశాంతి హైస్కూల్‌లో విద్యార్థులకు లైంగిక నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భరోసా కేంద్రం షీ టీం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు జ్యోతి, సతీశ్ విశ్వశాంతి హైస్కూల్ కరస్పాండెంట్ జక్కెన రమేశ్, ప్రిన్సిపాల్ జాహిద బేగం, భరోసా కేంద్ర కో-ఆర్డినేటర్ విజయ, సబార్డినేట్ ప్రియాంక పాల్గొన్నారు.

## అనుమతులు తరలిస్తున్న ఎరువుల పట్టివేత

చెన్నూర్ రూరల్, జూన్ 25 : చెన్నూర్ నుంచి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఎరువుల వాహనాన్ని పట్టుకున్నట్లు చెన్నూర్ మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు చెన్నూర్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద వాహనాలు తనిఖీ చేయగా, అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న 60 ఎరువుల బస్తాలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాటి విలువ రూ.72 వేలు ఉంటుందని తెలిపారు. వాహనాన్ని చెన్నూర్ పోలీసులకు అప్పగించి, జిల్లాస్థాయి అధికారులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.



చెన్నూర్ రూరల్ : కిష్టంపేట రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు



సిర్పూర్(టీ) : వీసీ సమావేశానికి హాజరైన అధికారులు, రైతులు.



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : రాతపూర్వక వివరణ అందజేస్తున్న రైతులు

# రైతు భరోసా, రుణమాఫీపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ

- రాతపూర్వకంగా స్వీకరించిన అధికారులు
- మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్

చెన్నూర్ రూరల్, జూన్ 25 : గతంలో కేసీఆర్ సర్కారు రైతు బంధు ఇచ్చినట్టుగా రైతు బరోసా పథకాన్ని కొనసాగించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. రైతు భరోసా, రుణమాఫీపై విధానాలు, కొత్త నిబంధనలకు సంబందించి రైతుల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలను సేకరించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ శాఖ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెన్నూర్ నియోజకవర్గ రైతులతో పాటు, వ్యవసాయ శాఖ అధికారులతో కిష్టంపేటలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను అధికారులు, ప్రజాప్రతినిధులకు వివరించారు. గతంలో కేసీఆర్ సర్కారు సకాలంలో రైతుల ఖాతాలో డబ్బు జమ చేసినట్లుగానే ఇప్పుడూ ఇవ్వాలని రైతులు కోరారు. సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులను గుర్తించి, పదెకరాల్లోపు రైతులకు రైతు బరోసా కింద డబ్బు చెల్లించాలన్నారు. ఇచ్చిన హామీల ప్రకారం రైతుకు, కౌలు రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. రుణమాఫీపై ఎలాంటి షరతులు విధించకుండా అందరికీ వర్తింపజేయాలన్నారు. రైతుల నుంచి తీసుకున్న దరఖాస్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఏడీఏ రాజేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్, కోటపల్లి, భీమారం ఏవోలు శ్రీనివాస్, మార్క్, మహేందర్, ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

**లక్షెట్టిపేటలో..**

లక్షెట్టిపేట, జూన్ 25 : లక్షెట్టిపేట పట్టణంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమం తూతూ మంత్రంగానే జరిగింది. రైతులు హాజరు కాగా, మండలస్థాయి అధికారులు నలుగురు, ఏఈవోలు 19మంది మాత్రమే హాజరయ్యారు. కాన్ఫరెన్స్‌లో మంత్రి.. అందరితో మాట్లాడకుండా మధ్యలోనే తన ప్రసంగం వినిపించి, వెళ్లిపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవోలు ప్రభాకర్‌రెడ్డి, అంజిత్‌కుమార్, కృష్ణ, సంగీత, ఏఈవోలు ప్రసన్న, గోవర్దన్, శ్రీనివాస్, అనూష, ఇర్ఫానా, ఏఈవోలు పాల్గొన్నారు.

**సిర్పూర్(టీ)లో..**

సిర్పూర్(టీ), జూన్ 25 : సిర్పూర్(టీ) మండలం కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన రైతులతో రైతు భరోసా, రుణమాఫీపై వ్యవసాయ శాఖ అధికారులు రాతపూర్వకంగా అభిప్రాయాలు సేకరించారు. అనంతరం రైతులకు పత్తి పంటతో పాటు వివిధ పంటలపై శాస్త్రవేత్తలు పలు సలహాలు, సూచనలు చేశారు. కాగజ్‌నగర్ ఏడీఏ మనోహర్, ఏవోలు మధులత, రామకృష్ణ, ఆయా మండలాల ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్‌లో..**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 25: ఏజెన్సీ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు రైతు భరోసాలో కోతలు విధించవద్దని, ఎంత భూమి ఉంటే ఆ మొత్తానికి సాయం అందించాలని ఆదివాసీ రైతు సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాలింషా అధికారులను కోరారు. మంగళవారం జన్కాపూర్‌లోని రైతు వేదికలో రైతుల నుంచి అభిప్రాయాలను అధికారులు స్వీకరించారు. ఈ మేరకు జాలింషాతో పాటు రైతులు వినతి పత్రం అందజేశారు.

# గోడ కూలి నలుగురికి గాయాలు

- 13న ఘటన మరువక ముందే మరో ప్రమాదం
- చర్యలు తీసుకోవాలంటున్న స్థానిక ప్రజలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ మారుతీ ప్రసాద్

మంచిర్యాల అర్బన్, జూన్ 25 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో గోడ కూలి ముగ్గురు కూలీలకు గాయాలైన ఘటన మంగళవారం జిల్లాలో కలకలం రేపింది. ఈ నెల 13న ఇలాగే జరిగిన ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతిచెందిన ఘటన మరువక ముందే మళ్లీ ప్రమాదం.. చర్చనీయాంశమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణం వేంకటేశ్వర థియేటర్ చౌరస్తా వద్ద గల తెలంగాణ లిక్కర్ మార్ట్ పక్కన విన్నంపల్లి లక్ష్మీనారాయణకు చెందిన భవనాన్ని కాంట్రాక్టర్ రమేశ్.. మేస్త్రి రామన్నతో పనులు చేపట్టారు. ఆ భవనానికి సంబంధించిన గోడనుఎత్తుగా నిర్మించారు. మంగళవారం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ గోడ మధ్యలో పట్టణానికి చెందిన అర్కెలిల గంగరాజు మట్టి నింపుతున్నాడు. కింద సెల్లార్‌లో సీసీసీకి చెందిన ఐటిపాముల రాములు, శ్రీరాంపూర్ కాలనీకిచెందిన పశుల మల్లయ్య, సోమగూడెంకు చెందిన నర్సయ్య పిల్లర్ నిర్మాణానికి సెంట్రింగ్ చేస్తున్నారు. గోడ ఇటుకలు, మధ్యలో పోసిన మట్టి వారిపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. నిర్వాహకులు హుటాహుటిన పట్టణంలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ బన్సీలాల్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు. సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ముందే నోటీసులు జారీ చేశాం.. : మంచిర్యాల కమిషనర్ మారుతీ ప్రసాద్**

గోడ కూలి గాయాలైన సంఘటనాస్థలాన్ని మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఈ భవనానికి ఈ నెల 13న జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకొని రక్షణ చర్యలు లేకపోవడంతో ముందే నోటీసులు జారీ చేశామన్నారు. జాగ్రత్తలు తీసుకుంటూ నిర్మాణం చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. అయినా సదరు కాంట్రాక్టర్ నిబంధనలు పాటించకుండా క్యూరింగ్ కాని గోడ మధ్యలో మట్టి నింపడంతో ప్రమాదం జరిగిందన్నారు. దీనిపై చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

## కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాల అర్బన్, జూన్ 25 : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా 27 నుంచి జూలై 10వ తేదీ వరకు కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంచిర్యాల డీఎంహెచ్‌వో అనిత తెలిపారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆరోగ్య కార్యకర్తలు కలిసి గ్రామాల్లో అర్హులైన దంపతులకు అవగాహన కల్పించాలన్నారు. కుటుంబ నియంత్రణ టెంపరరీ పర్మినెంట్ పద్ధతుల గురించి తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా నీరజ, డా అరుణ, ప్రశాంతి, వెంకటేశ్వర్లు, ఎస్‌వో దామోదర్, రాజేశ్వర్, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కాగజ్‌నగర్, జూన్ 25 : కాగజ్‌నగర్ పట్టణంలోని తిలక్‌నగర్ ప్రభుత్వ ప్రాథిమిక ఉన్నత పాఠశాల 2003-04 ఏడోతరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం అ'పూర్వ' సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు.

## పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

తాండూర్, జూన్ 25 : మండలంలోని విద్యుత్ వినియోగదారులు తమ పెండింగ్ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని విద్యుత్ శాఖ మంచిర్యాల ఎస్ఈ శ్రావణ్‌కుమార్ సూచించారు. మండల పరిధిలో రైల్వే లైన్ కింద భూగర్భ మార్గంలో ఉన్న విద్యుత్ తీగలను మంగళవారం పరిశీలించారు. రైల్వే మూడో లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో తీగలకు నష్టం జరగకుండా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యుత్ అధికారులు పెండింగ్ బిల్లుల జాబితాతో ఇంటింటా తిరుగుతూ బిల్లులు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీనివాస్, ఏఈ ప్రభాకర్, సబ్ ఇంజినీర్ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ రవి, లైన్‌మన్లు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఏబీవీపీ బంద్

బెల్లంపల్లి, జూన్ 25 : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్త బంద్ నిర్వహిస్తున్నట్టు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దందాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ బంద్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పాల్గొనాలని కోరారు.

## భూ సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, జూన్ 25: గోలేటి, సోనాపూర్ గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించి, బీసీ, ఎస్సీ రైతులకు పట్టాలివ్వాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. తహసీల్దార్ జ్యోత్స్న, తిర్యాణి ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌కు వినతిపత్రాలు అందించారు. అరిగెల మధుకర్‌గౌడ్, చేపూరి వెంకటస్వామి, జిట్టవేణి వెంకటేశ్, జిట్టవేణి హన్మంతు, జిట్టవేణి మహేశ్, నాణవేణి అనిల్, జటంగుల సాయి, పడాల రాకేశ్ ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాల టౌన్, జూన్ 25 : మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డులో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ మారుతీ ప్రసాద్‌కు కౌన్సిలర్ సురేశ్ బల్దవా మంగళవారం వినతిపత్రం అందజేశారు. కాలేజీ రోడ్ జంక్షన్‌లో ఎక్స్‌కవేటర్‌తో తవ్వడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. హమాలీవాడ గేటు వద్ద రూ.12 లక్షలతో నిర్మించిన రోడ్డు నిర్మాణం నాణ్యత లేదని, అధికారులు పట్టించుకోవాలని కోరారు. రైల్వే లైన్ పక్కన రోడ్డుపై పేరుకుపోతున్న చెత్తాచెదారం తొలగించాలని కోరారు.

## 'గృహజ్యోతి' కోసం తిప్పలు



ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులు

చింతలమానేపల్లి, జూన్ 25 : గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో విద్యుత్ బిల్లు రాకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా రావడంలేదని వాపోతున్నారు. కాగా, మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు ఎంపీడీవో కార్యాలయానికి క్యూ కడుతున్నారు. మంగళవారం పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు వచ్చి దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు వివరాలు నమోదు చేసి, సరిచేస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు లేక కొందరు గృహజ్యోతికి దూరమయ్యారు. వివరాలు ఆన్‌లైన్ కాలేదని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## ఇద్దరిపై కేసు

హాజీపూర్, జూన్ 25 : మండలంలోని వేంపల్లి గ్రామం పోచంపాడు శివారులోని భూ వివాదంలో జరిగిన పరస్పర దాడిలో ఒకరిపై ఒక్కరు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. మూడెకరాల భూమిలో విత్తనాలు నాటుతున్న నస్పూర్‌కు చెందిన బోరిగం వెంకటేశ్‌ను సామ్యూల్, అతని సోదరుడు ప్రేమ్‌సాగర్ అడ్డుకున్నారు. ఆ భూమి తమదంటే తమదని గొడవ పడ్డారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 25 : ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ పిలుపునిచ్చారు. మంగళవారం ఆసిఫాబాద్ జడ్పీ బాలికల పాఠశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవంలో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్ తదితరులు ఉన్నారు.

## బహిరంగ వేలం

చెన్నూర్ టౌన్, జూన్ 25 : చెన్నూర్ పట్టణంలోని శ్రీ మధున పోచమ్మ ఆలయంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం రాజమౌళి పర్యవేక్షణలో మంగళవారం బహిరంగ వేలం వేశారు. జూలై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు కొబ్బరి కాయలు, పూజా, కిరాణా సామగ్రి, ఆట వస్తువులు, శీతల పానియాలు అమ్ముకునేందుకు వేలాన్ని కురుమ అన్వేష్ గౌడ్ తండ్రి వెంకటస్వామి రూ.2 లక్షలకు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ముక్త రవి, అర్చక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై సదస్సు

శ్రీరాంపూర్, జూన్ 25 : వాహనదారులు వాహనాల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని శ్రీరాంపూర్ సీఐ మోహన్ హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏరియా వాహనదారులు, ఆటో డ్రైవర్లు, ఓనర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ సంతోష్, ఏఎస్ఐ పాషా, కానిస్టేబుళ్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల చేయూత

దండేపల్లి, జూన్ 25 : దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు 2003-04 పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. రూ.10వేల విలువైన 1 హెచ్‌పీ మోటార్‌కు సంబంధించిన నగదును పాఠశాల హెచ్ఎం శంకర్‌గౌడ్‌కు ఆనాటి గురువు సంఘర్ష్ రాజేశ్వర్‌రావు చేతుల మీదుగా అందించారు. పూర్వ విద్యార్థులు అల్లంల కుమారస్వామి, భూమన్న, నగేశ్, శ్రీధర్, సుధాకర్, రాజ్‌కుమార్ ఉన్నారు.

## కొనసాగుతున్న కౌన్సెలింగ్

బెల్లంపల్లి, జూన్ 25 : బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్ లైన్ కేంద్రంలో పాలిసెట్-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతున్నది. మంగళవారం 168 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారి ధ్రువీకరణ పత్రాలను సంబంధిత అధికారులు పరిశీలించారు.

## అప్రమత్తంగా ఉండాలి

కాసిపేట, జూన్ 25 : విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్, ఆన్‌లైన్ లోన్లపై అప్రమత్తంగా ఉండాలని కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సూచించారు. కాసిపేట మోడల్ స్కూల్, కళాశాలలో మంగళవా రం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారీగా గుట్కా నిల్వలు స్వాధీనం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 25 : జిల్లా కేంద్రంలో భారీగా గుట్కా నిల్వలను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వెనుకాల ఉన్న గోదాంలో గుట్కానిల్వలు ఉన్నాయనే సమాచారం మేరకు మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో పోలీసులు తనిఖీ చేశారు. దాదాపు రూ.8 లక్షల విలువైన గుట్కా పట్టుకున్నారు. మహారాష్ట్రంలోని చంద్రాపూర్ నుంచి అక్రమంగా ఆసిఫాబాద్‌కు గుట్కాను తరలించి, అమిత్‌కు చెందిన గోదాంలో నిల్వచేసి ఉంచినట్టు గుర్తించారు. పట్టుకున్న గుట్కాను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లాలో నిషేధిత పదార్థాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు.

## తండ్రిపై దాడి చేసిన కొడుకుకు జైలు

బెల్లంపల్లి, జూన్ 25 : మద్యం తాగేందుకు పింఛన్ డబ్బులు ఇవ్వడం లేదని తండ్రిపై దాడిచేసిన కొడుకుకు బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముఖేశ్ 6 నెలల జైలు శిక్ష విధించారు. కన్నాల పంచాయతీ పరిధి లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గుమ్ముల శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. జనవరి 15న డబ్బుల కోసం తండ్రి మల్లయ్యతో గొడవపడ్డాడు. కర్రతో దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. అదే రోజు తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో మల్లయ్య ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ గోపు నరేశ్ దర్యాప్తు చేశారు. సాక్షులను కోర్టులో హాజరుపర్చగా, శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## చుక్కల దుప్పికి గాయాలు



దుప్పికి ప్రథమ చికిత్స చేస్తున్న గ్రామస్తులు

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 25 : కొత్త సార్సలలో చుక్కలదుప్పిపై వీధి కుక్కల దాడి చేశాయి. దీంతో దుప్పికి గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు పుల్ల శ్రీకాంత్, పూదరి మధూకర్, పూదరి సుధాకర్, కర్నె నవీన్.. ఆ కుక్కలను తరిమికొట్టారు. దుప్పికి ప్రథమ చికిత్స అందించి, అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. అనంతరం దానిని అడవిలో వదిలిపెట్టారు.

## ప్రోత్సాహక నిధులు విడుదల

బెల్లంపల్లి, జూన్ 25 : ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రోత్సాహక నిధులు విడుదలైనట్లు మండల ఉద్యానవన శాఖ అధికారి చెలుపూరి సుప్రజ తెలిపారు. నియోజకవర్గంలోని 7 మండలాల ఆయిల్ పామ్ రైతులకు రెండో ఏడాది మెయింటనెన్స్, అంతర పంట సాగును ప్రోత్సహించేందుకు ఎకరానికి రూ.4వేల అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 234 ఎకరాలకు సంబంధించి 59 మంది రైతుల ఖాతాలో నిధులు జమ చేసినట్లు వెల్లడించారు.

## ఎన్నికలు నిర్వహించాలి

మందమర్రి, జూన్ 25 : మందమర్రి మున్సిపాలిటీలో పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని సాధన జేఏసీ సభ్యులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు గుడికందుల రమేశ్, మేసినేని అరుణ్, కస్తూరి శ్రీనాథ్ చారి, రామంచ తిరుపతి, ఎండీ ముజాహిద్, పాలమాకుల భీంసేన్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం

కాగజ్‌నగర్, జూన్ 25: కాగజ్‌నగర్ పట్టణంలోని రాజస్థాన్ భవనంలో మర్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. మార్వాడీ యువ మోర్చా అధ్యక్షుడు అరుణ్‌లోయ, ప్రతినిధులు అభిషేక్, నాయకులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీ

కౌటాల, జూన్ 25 : కౌటాల మండలం శిర్షా, కనికి ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ముత్తంపేట కాంప్లెక్స్ హెచ్ఎం గావుడే హన్మంతు తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించేలా బోధించాలన్నారు. చేయాలని ముత్తంపేట కాంప్లెక్స్ హెచ్ఎం గావుడే హన్మంతు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. ఆయన వెంట సీఆర్పీ గంధం ప్రకాశ్, ఉపాధ్యాయులున్నారు..

## బోరుబావి పనులు ప్రారంభం

కోటపల్లి, జూన్ 25 : కోటపల్లి కేజీబీవీలో బోరుబావి పనులను ఎంపీపీ మంత్రి సురేఖ ప్రారంభించారు. నీటి సమస్య పరిష్కారానికి బోరు మంజూరు చేసిన కలెక్టర్‌కు, కృషి చేసిన ఎంపీపీ మంత్రి సురేఖకు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ హరిత ధన్యవాదాలు తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, జూన్ 25 : మంచిర్యాల జిల్లాలోని 18 కేజీబీవీ పాఠశాలల్లో గల సెప్టిక్ ట్యాంకుల క్లీనింగ్, మెయింటనెన్స్ కోసం కొటేషన్లకు ఈ నెల 26 నుంచి 28 వరకు డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## '108'లో కవలల జననం

వాంకిడి, జూన్ 25: పిప్పర్‌గొందికి చెందిన జాదవ్ సురేఖ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. పురిటి నొప్పులు వచ్చిన సురేఖను మంగళవారం 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో డెలివరీ అయింది. ఇద్దరు కవల పిల్లలు జన్మించారు. తల్లీ పిల్లలు క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

## తలసేమియా, సికిల్‌సెల్ పై అవగాహన

మందమర్రి, జూన్ 25 : మందమర్రి పట్టణంలోని స్టేషన్‌రోడ్డు కాలనీలో గల గ్రేస్ లిటిల్‌హార్ట్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వం తరుపున గుర్తింపు కార్డులు ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.